ప్రజాశక్తి
ఆదివారం 19 అక్టోబర్ 2025
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

# పేదల బియ్యం పక్కదారి..!

- యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్‌కు తరలింపు
- ఈ ఏడాది 94 కేసులు నమోదు
- రూ.1.20 కోట్ల విలువ చేసే బియ్యం సీజ్
- అనేక డిపోలకు ఇన్చార్జి డీలర్లు

ఈ నెల 9న రేషన్ బియ్యం తరలిస్తూ సీజ్ చేసిన వాహనం (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి-విజయవాడ:** పేదలకు దక్కాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. సివిల్ సప్లై నిబంధనలకు విరుద్ధంగా బడాబాబుల, రాజకీయ నాయకుల అండదండలతో కొందరు సివిల్ సప్లై డీలర్లు యథేచ్ఛగా చౌకడిపోల నుంచి బియ్యాన్ని బయటకు తరలిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో సివిల్‌సప్లై బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నా...పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విజయవాడ కృష్ణలంక నెహ్రూనగర్‌లోని చౌకడిపోలోని 27 క్వింటాళ్ల రైస్‌తో పాటు ఒక వ్యాన్‌లో గుంటూరుకు తరలించే సమయములో పోలీసులు ఆ వ్యాన్‌తో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కృష్ణలంక పోలీస్టేషన్‌కు తరలించి, సంబందిత డీలర్‌తో పాటు వాహన డ్రైవర్‌పై 6ఎ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే షాపులో ఉండాల్సిన స్టాక్ కన్నా ఐదు క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు జిల్లా సివిల్‌సప్లై అధికారుల పరిశీలనలో తేలింది. అంతేగాక అరకేజీ చొప్పున 388 ప్యాకేజీలు తరలించే సమయములో వాటిని స్వాధీనం చేసుకొని డిపోను సీజ్ చేసి, సదరు డీలర్‌పై 6ఎ కింద కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు చేసిన మరుసటి రోజునే ఆ డీలర్ దర్జాగా వీధుల్లో దర్శనమివ్వడం పలు విమర్శలకు తావిస్తుంది. ఇదే రీతిలో నందిగామ, తిరువూరు, విసన్నపేట తదితర జిల్లా అంతటా కూడా ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు చౌకడిపోల నుంచి అక్రమంగా బియ్యం తరలిస్తున్న 94 మందిపై 6ఎ కింద కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 194. 679 టన్నుల బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. వీటి విలువ రూ. కోటి 20 లక్షల వరకు ఉంటుందని స్వయంగా జిల్లా అధికారుల రికార్డులు విధితం చేస్తుంటే...అనధికారికంగా...వెలుగులోకి రాని ఇంకెంత సరుకు బయటకు తరలిపోయిందోననే చర్చ లేకపోలేదు. ఎన్‌టిఆర్ జిల్లాలో 5.90 లక్షల తెల్లరేషన్‌కార్డులున్నాయి. జిల్లాలోని 957 రేషన్‌షాపులున్నాయి. వీటిల్లో విజయవాడ సిటీలోని మూడు సర్కిల్స్ పరిధిలో 336 షాపులు నడుస్తున్నాయి. నెలకు తొమ్మిది వేల టన్నుల బియ్యం చౌకడీపోల ద్వారా కార్డుదారులకు పంపిణీ జరగాలి. ఒక్కొక్క షాపు పరిధిలో 600 నుంచి వెయ్యి వరకు కార్డులుంటాయి. అయితే సివిల్ సప్లై కార్డు దారులకు బియ్యం ఇవ్వకుండానే, కేజీకి రూ. పది చొప్పున డబ్బులు చేతిలో పెట్టి సదరు పలువురు డీలర్లు (మిగతా 2లో)

# వైసిపి ప్రోత్సాహంతోనే మద్యం కల్తీ

- మంత్రి కొల్లు రవీంద్ర

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)**

వైసిపి నేతల ప్రోత్సాహంతోనే కల్తీ మద్యం తయారు చేసినట్లు కేసులో ప్రధాన నిందితుడు జనార్ధనరావు స్పష్టం చేశాడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి జోగి రమేష్ అండతోనే ఇబ్రహీంపట్నం, మొలకలచెరువులో మద్యం కల్తీ చేసినట్లు తెలిపాడని, అదే సమయంలో జనార్ధన్‌రావు తన ఇంటికొచ్చినట్లు జోగి రమేష్ కుడా అంగీకరించాడని, కల్తీ మద్యం కేసులో వైసిపి నేతల పాత్ర, బయటపడుతుండటంతో ప్రజల దృష్టి మరల్చేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. కల్తీ మద్యం కేసులో నివేదికలు బయటకు రాకముందే వైసిపి నేతలు, బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టం రాష్ట్రంలో అమలు కావడం లేదని పేర్ని నాని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విధానాన్ని 2014-19 మధ్య తీసుకొచ్చామని, జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 2019-24 మధ్య మొత్తం వ్యవస్థను నాశనం చేశారని అన్నారు. పేర్ని నానికి మతిభ్రమించి ఏం మాట్లాడుతున్నాడో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లుగా బలవంతంగా కల్తీ బ్రాండ్లను ప్రజల నెత్తిన రుద్దే పరిస్థితి లేదనే విషయం పేర్ని తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్ని భయంబ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా జగన్ రెడ్డి, వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. తప్పులు చేసి ఆ తప్పిదాలను ప్రజల నెత్తిన రుద్దాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో మద్యం కల్తీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అందుకే ఏపీ సురక్షా యాప్ తీసుకొచ్చామని చెప్పారు. ప్రతి బాటిల్ స్కాన్ చేస్తూ కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు.

# సాంకేతికతతో త్వరగా పౌర సేవలు

## విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

**ప్రజాశక్తి-విజయవాడ:** పరిపాలనా పరమైన అంశాల్లో ఆధునిక టెక్నాలజీని జోడించి పౌర సేవలు త్వరగా ప్రజలకు చేరువయ్యే విధంగా అహ్మదాబాద్ నగరపాలక సంస్థ పని చేస్తుందని, అదే విధానాన్ని విజయవాడ నగరపాలక సంస్థలో కూడా అమలు చేస్తామని విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ హోంమంత్రి సర్ధార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నేతృత్వంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన 'నేషనల్ అర్బన్ కాంక్లేవ్ అండ్ మెయరల్ సమ్మిట్'లో మేయర్ భ్యాగలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను వియంసిలోని ఆమె ఛాంబర్‌లో శనివారం మీడియాకు తెలిపారు. 'షేపింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ సిటీస్' అనే అంశంపై జరిగిన సదస్సులో దేశంలోని 110కి పైగా నగరాల నుంచి మేయర్స్, పలువురు నాయకులు పాల్గొన్నారని అన్నారు. అహ్మదాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, వాటి అనుభవాలు, అలాగే దేశంలోని ఆయా నగరాల్లో పాలనాపరమైన అంశాల్లో అమలు చేస్తున్న సంస్కరణలు, వాటి అనుభవాలను ఈ సదస్సులో చర్చించడం జరిగిందన్నారు. అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పాలనాపరమైన అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు అవసరమైన సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఆ నగరం పరిధిలో చేపట్టిన 'సబర్మతి రివర్‌ఫ్రెంట్ డెవలప్‌మెంట్' పథకాన్ని ఎంతో వ్యయప్రయాసాల కోర్చి అమలు చేయడం జరుగుతుందన్నారు. సబర్మతి నదిని శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా (మిగతా 2లో)

అహ్మదాబాద్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న మేయర్ భాగలక్ష్మి

మచిలీపట్నం, తిరువూరుల్లో అవగాహనా ర్యాలీలను ప్రారంభిస్తున్న కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ

# కాలుష్య నివారణకు కృషి చేద్దాం

- స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యకర జీవనం
- పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యం
- తిరువూరు, మచిలీపట్నంల్లో అవగాహనా ర్యాలీలు

**ప్రజాశక్తి-తిరువూరు, కలెక్టరేట్ (కృష్ణా)**

ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేస్తూ కాలుష్య నివారణకు సమిష్టిగా కృషి చేయాలని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు డికె బాలాజీ, డా.లక్ష్మీశ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా తిరువూరు, మచిలీపట్నంల్లో శనివారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. తిరువూరులోని లక్ష్మీపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ-బైక్, సైకిళ్ల ర్యాలీని ప్రారంభించిన అనంతరం మొక్కలు నాటి స్థానిక రైతులకు కిలో రూ.10కే వర్మీ కంపోస్టును అందజేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ, వైద్య ఆరోగ్యశాఖ, పిఎం సూర్యఘర్ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, ఎంఎల్ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యకర జీవనం కొనసాగించవచ్చన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించడం, విస్తృతంగా మొక్కలు నాటడం, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడం, పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించే విధానాలను అనుసరించడం, పంట అవశేషాల్ని కాల్చకుండా నివారించడం వంటివి పాటించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి రెండింటికీ స్వచ్ఛమైన గాలి అత్యంత అవసరమని, కాలుష్యాన్ని కట్టడి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందని అన్నారు. గాలి కాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలతో పాటు వివిధ అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా పర్యావరణహితంగా దీపావళి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గృహ కంపోస్టు పిట్‌తో పాటు ఇంకుడు గుంతల పనులను ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయంపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. గ్రీన్ అంబాసిడర్లతో పాటు తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా ఇస్తూ వ్యర్థాల నిర్వహణలో కీలక భాగస్వాములవుతున్న మహిళలను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, ఎంపిపి జి.భారతి, గ్రామ సర్పంచ్ జి.శ్రీనివాసరావు, తిరువూరు ఆర్‌డిఒ కె.మాధురి, డిపిఒ పి.లావణ్య కుమారి, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, గ్రామ పెద్దలు ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే వాహనాలు ఉపయోగించి వాయు, శబ్ద (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

## కాలుష్య నివారణకు కృషి చేద్దాం

కాలుష్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మచిలీపట్నం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్ నుండి కోనేరు సెంటర్ మీదుగా మూడు స్తంభాల సెంటర్ వరకు అవగాహనా సైకిల్ ర్యాలీ శనివారం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన సైకిల్ తొక్కుతూ నగర పౌరులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో వాహనాల వినియోగం రోజురోజుకు పెరిగి వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పెట్రోల్, డీజిల్ వంటి చమురు ఆధారిత వాహనాల వినియోగాన్ని తగ్గించి విద్యుత్ వాహనాల వైపు ఆసక్తి చూపాలన్నారు.

## సాంకేతికతతో త్వరగా పౌర సేవలు

నర్మదానది నుంచి సబర్మతి నదికి నీరు వచ్చి చేరడమేగాక, నగరపరిధిలోని స్ట్రామ్ వాటర్‌ను శుద్ధి చేసి సబర్మతి నదిలోకి పంపించడం, పలు రూపాల్లో సబర్మతి నది నీటిని శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. రూ.350 కోట్ల అంచనా వ్యయంతో ఐదు దశల్లో నదిని శుద్ధి చేయడంతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం రూ.70 కోట్ల వ్యయంతో మొదటి, రెండవ దశ పనులు పూర్తి చేశారన్నారు. దీని పక్కనే ఫ్లవర్ పార్కును ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతూ అభివృద్ధి చేస్తున్నారన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గౌతమ్ నేతృత్వంలో ఈ సబర్మతినదిని శుద్ధి చేసి, అభివృద్ధి చేసే పని జరుగుతుందన్నారు. నగరంలో యుజిడి వ్యవస్థను మెరుగుపరిచారన్నారు. 82 లక్షల జనాభా కల్గిన అహ్మదాబాద్ నగరపాలక సంస్థకు పారిశ్రామిక రంగం నుంచి పన్నుల రూపంలో అత్యధికంగా రాబడి వస్తుంటుందని అన్నారు. గార్బేజీ ఫ్రీసిటీ ర్యాంక్ సాధించిందన్నారు. ఆ రాష్ట్ర సిఎం భూపేంద్రపాటిల్, అహ్మదాబాద్ నగర మేయర్ ప్రతిభాబెన్ జైన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు.

## బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

### ప్రముఖ వైద్యులు సౌజన్య

**ప్రజాశక్తి–హెల్త్ యూనివర్సిటీ:** దీపావళి పండుగ సందర్భంగా కాల్చే బాణాసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కంటి విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీపీఈఐ వైద్యులు సౌజన్య ఉయ్యూరు సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా కాల్చే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం విజయవాడ ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల కోడే వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఒకవేళ ప్రమాదవశాత్తు కంటికి గాయమైతే సున్నితంగా శుభ్రం చేసి, కంటిలో ఏదైనా నలకలు ఉంటే, వాటిని శుభ్రమైన నీరు లేదా సెలైన్‌తో శుభ్రం చేయాలి తప్ప కంట్లో నలకలు తొలగించటానికి ఇంట్లో ఏదైనా ఇతర పదార్థాలను ఉపయోగించరాదన్నారు. గాయపడిన కన్ను మూసి ఉంచి వెంటనే కంటి సంరక్షణా నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలన్నారు. నేత్ర వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఇంటి వైద్యం చేయటం మానుకోవాలని, దీనివలన ఒకోసారి చూపు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రజలు ఏదైనా ఇబ్బందులు ఎదుర్కొంటే విజయవాడ ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్లు 086667 12009, 086667 12020, 080995 12020లలో సంప్రదించాలని కోరారు.

## తనిష్క్ రివాహ్ కలెక్షన్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి–విజయవాడ అర్బన్:** తనిష్క్ ప్రత్యేక వివాహ ఆభరణాల బ్రాండ్ 'రివాహ్' వారసత్వ హస్తకళల గొప్పతనాన్ని చాటుతూ, ఆధునిక డిజైన్లతో కూడిన అద్భుతమైన పెళ్లి, పండుగ నగల కలెక్షన్‌ను ఆవిష్కరించిందని తనిష్క్ చీఫ్ డిజైనింగ్ ఆఫీసర్ రేవతి కాంత్ తెలిపారు. నగరంలోని తనిష్క్ షోరూమ్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. దీపావళి, రాబోయే పెళ్లి ముహూర్తాలను దృష్టిలో ఉంచుకుని, రివాహ్ ఈ కలెక్షన్‌ను అందిస్తోందన్నారు. ఇందులో పెళ్లికి ముందు జరిగే చిన్న వేడుకల నుండి, అంగరంగ వైభవంగా జరిగే వివాహ వేడుకల వరకు, ప్రతి సందర్భానికీ సరిపోయే ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి పెళ్లికూతురు వద్ద తప్పక ఉండాల్సినవిగా, పెళ్లి రోజుకే పరిమితం కాకుండా, తరతరాలు నిలిచిపోయే వారసత్వ సంపదగా ఈ ఆభరణాలను తీర్చిదిద్దారని తెలిపారు. ఈ సీజన్‌లో సరికొత్త సొబగులు అద్దిన కాసుమాల, ఆలయ ఆభరణాల (టెంపుల్ జువెలరీ) శ్రేణి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోందని అన్నారు.

## జియో డిటెక్ అసెట్‌తో కచ్చితమైన మ్యాప్‌లు : కలెక్టర్

**ప్రజాశక్తి–విజయవాడ:** పటాల (మ్యాపుల) తయారీకి, సర్వేకు అత్యంత కీలకమైన స్టాండర్డ్ బెంచ్ మార్కులను సర్వే ఆఫ్ ఇండియా పరిరక్షించడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్లోని 1910 నాటి స్టాండర్డ్ బెంచ్ మార్క్ పునరుద్ధరణ శిలాఫలకాన్ని సర్వే ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ బీసీ పరిడా తో కలసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ... రాష్ట్రంలో స్టాండర్డ్ బెంచ్ మార్కులు(ఎస్ బి ఎం) 89, బెంచ్ మార్కులు (బి ఎం) వేయికి పైగా ఉన్నాయని, కలెక్టరేట్లోని 1910 నాటి స్టాండర్డ్ బెంచ్ మార్కును సర్వే ఆఫ్ ఇండియా మొట్టమొదటిగా పునరుద్ధరించిందని చెప్పారు. ఈ బెంచ్ మార్కుల సహాయంతో అత్యంత కచ్చితత్వంతో (పొజిషన్) స్థానాన్ని చెప్పవచ్చని అన్నారు. సర్వేకు, మ్యాపుల రూపకల్పనకు, మౌలిక సదుపాయాల అభివద్ధికి, శాస్త్ర పరిశోధనకు ఈ బెంచ్ మార్కులు దోహదం చేస్తాయని, విపత్తు నిర్వహణలో వీటి పాత్ర కీలకమని అన్నారు. మైదాన ప్రాంతాల్లోని బెంచ్ మార్కులే కాక ఎత్తయిన కొండలపై గల బెంచ్ మార్కులను కూడా సర్వే ఆఫ్ ఇండియా పరిరక్షిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్వే ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ బీసీ పరిడ మాట్లాడుతూ.... జియోడెటిక్ రిజిస్టర్‌ను రూపొందిస్తున్నామని, ఎన్టీఆర్ జిల్లాలోని బెంచ్ మార్కుల సమాచారంతో కూడిన ఈ రిజిస్టర్ ను త్వరలో జిల్లా యంత్రాంగానికి అందజేస్తామని చెప్పారు. సర్వేకు, మ్యాపులకు అత్యంత కీలకమైన ఈ బెంచ్ మార్కులు బ్రిటిష్ హయాంలో ఏర్పాటు చేశారని వీటిని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. దీనికై మూడు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఎల్ ఓ వై.మోహన్ రావు, సర్వే ఇన్స్పెక్టర్ ఏ.జగన్మోహన్, సర్వే ఆఫ్ ఇండియా ఆఫీసర్లు సమీరుద్దీన్ ఖాన్, పి. నిత్యానందం పాల్గొన్నారు.

## పేదల బియ్యం పక్కదారి..!

ఆ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం సర్వసాధారణమని చెప్పక తప్పదు. సివిల్ సప్లై బియ్యం కేజి రూ. 42 చొప్పున ప్రభుత్వం కొనుగోలుచేసి, చౌకడీపోలకు సప్లై చేస్తూ , సబ్సిడీ భరిస్తూ సదరు కార్డుదారులకు కేజి రూపాయికే సరఫరా చేస్తుంటుంది. అయితే సదరు డీలర్లు కార్డుదారుల దగ్గర రూ. పది నుంచి 13 వరకు కొనుగోలు చేసి రూ.18 నుంచి 20 వరకు బయట విక్రయిస్తుంటారని స్వయంగా సంబంధిత అధికారుల నుంచే సమాచారం అందుతుంది. అనేక లోసుగుల నడుమ చౌకడీపోల ద్వారా బియ్యం అక్రమంగా బయటకు తరలిపోతోంది. విజయవాడ సిటీతోపాటు జిల్లా వ్యాప్తంగా పలు చౌకడిపోలను ఇన్‌చార్జీలే నిర్వహిస్తున్నారు. లోపించిన పర్యవేక్షణ, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోవడం, ఈ అక్రమ వ్యాపారం వెనుకాల బలమైన రాజకీయ నాయకుల అండదండలు ఉండటం, బలమైన కేసులు, వాటి అమలు లేకపోవడం తదితర అనేక కారణాలతో సివిల్‌సప్లై వ్యవస్థ క్షేత్ర స్థాయిలో దాని లక్ష్యం నెరవేరకపోగా, దుర్వినియోగం అవుతుంది. ఫలితంగా పేద వాడికి కనీసంగా ఆ రూపాయి బియ్యం కూడా అందుబాటులో లేకుండా చేసే పనికి ప్రభుత్వ లోపభూయిష్టమైన చట్టంలోని లొసుగులే కారణమని సదరు లబ్దిదారులు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం పక్క మార్గాలు పడుతున్నా... జిల్లా స్థాయి, డివిజన్, మండల స్థాయి అధికారులు చేష్టలుడికి చూస్తున్నారనే విమర్శలు బహాటంగా వినిపిస్తున్నాయి. సివిల్ సప్లై బియ్యం అక్రమ వ్యాపారాన్ని నివారించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా స్థాయి అధికారుల దగ్గర నుంచి దిగువ స్థాయి అధికారుల వరకు ప్రకటనలు గుప్పించడమే తప్పా...ఆచరణలో మాత్రం బియ్యం అక్రమ వ్యాపారం ఆగకపోగా, ఇంకా ఉధృతం అవుతూ... భారీ స్థాయిలో పలువురు డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శ లేకపోలేదు. అయితే ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడే పలువురు డీలర్ల వెనుకాల పెద్ద తలకాయలు (రాజకీయ నాయకులు, బడాబాబులు, పలువురు అధికారుల) అండదండలు పుష్కలంగా ఉండటం వలనే ఇటువంటి అక్రమ వ్యాపారం జరుగుతుందనే చర్చ విజయవాడ సిటీతో పాటు ఎన్‌టిఆర్‌జిల్లాలో ఉంది. ఈ ఏడాదిలో కోట్లాది రూపాయల విలువ చేసే సివిల్ సప్లై బియ్యం తరలిపోయినట్లు అధికారుల రికార్డులే విధితం చేస్తున్నాయి. సంబందిత డీలర్లపై కేసులు నమోదు అవుతున్నా... అవి ఎటువంటి ప్రభావం చూపకపోగా, చిటికెలో ఆ కేసుల నుంచి బయటపడుతున్నారు. నేరుగా పట్టుబడినప్పటికీ ఇటువంటి కేసులు తమను ఏమి చేయలేవనే ధీమాతో యధామామూలుగా మరుసటి రోజే వీధుల్లో ప్రత్యక్షమవుతున్నారు. సివిల్ సప్లై బియ్యం అక్రమ వ్యాపారంపై జిల్లా సివిల్ సప్లై అధికారి ఎ. పాపారావు సమాధానమిస్తూ... బియ్యం అక్రమంగా తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల నెహ్రూనగర్‌లో పట్టుబడిన సివిల్‌సప్లై బియ్యాన్నిస్వాధీనం చేసుకొని సదరు డీలర్‌పై కేసును నమోదు చేశామన్నారు. ఇదే రీతిలో జిల్లా అంతటా నిఘా పెంచామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో చౌక డిపోల ద్వారా సక్రమంగా బియ్యం పంపిణీ జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.


### పేరు మార్పు / సవరణ

నేను కాకర్ల లీలా గీతాశ్రీ, W/o కాకర్ల చిరంజీవి వేణు, నివాసం : డోర్ నెం. 5-40, నున్న, విజయవాడ రూరల్.
ప్రస్తుతం నా ఆధార్‌కార్డులో నా పేరు కాకర్ల లీలా గీతాశ్రీ అని నమోదు కాబడినది. ఇప్పుడు పేరు సవరణ / మార్పు చేయగా **గీతాశ్రీ కంచర్ల, W/o కాకర్ల చిరంజీవి వేణు** (Geethasri Kancharla W/o Kakarla Chiranjeevi Venu) గా మార్పు చేయబడుతుంది. నేటి నుండి నా పేరును **గీతాశ్రీ కంచర్ల** అని పిలవబడును. ఆధార్‌లో మార్పు కొరకు.

### ప్రకటన

నా క్లయింట్, గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, గొడవర్రు గ్రామం, వాస్తవ్యుడు లేటు బహుజంకు నరసదాసు గారి కుమారుడు బహుజంకు వెంకట నారాయణ గారి వలన సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయినది ఏమనగా నా క్లయింట్ యొక్క పెద్ద కుమారుడు అయిన బహుజంకు వెంకట రామాంజనేయులు వారి నాన్న గారి స్వాధీన భుక్తములలో ఉన్న మరియు విజయవాడ సబ్ రిజిస్టర్ వారి కార్యాలయంలో Book III నెం 24/1986 గా రిజిస్టర్ అయిన దాని తాలూకు ఒరిజినల్ దస్తావేజు మరియు వాటి లింకు డాక్యుమెంట్ల కాపీలు ద నెం: 686/1969, 687/1969 విక్రయము నకు పెట్టుటకు మధ్యవర్తికి చూపించదలచి గన్నవరం వెళుతూ డాక్యుమెంట్లు కలిగిన కవరు మరియు చెక్కులు ఇతర కాగితములు కలిగిన కవరు రెండిటిని తనతో తీసుకుని అదే త్రోవలోని నా ఆఫీసుకు పని నిమిత్తము వస్తూ, రామవరప్పాడు సెంటర్ దగ్గర పండ్లు కొనుగోలు చేయు నిమిత్తము దిగి కొనుగోలు చేసిన తరువాత ముందుకు రాగా ఎనికేపాడు సెంటర్ లో చూసుకొనగా డాక్యుమెంట్లు కలిగిన కవరు పోయినది. తిరిగి రామవరప్పాడు సెంటర్ కు వెళ్లి వెతకగా అక్కడ దొరకలేదు కావున పైన తెలిపిన దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింద తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

**జానపాటి రవికుమార్**
**న్యాయవాది**
**ప్లాట్ నెం 201, పొన్నారి క్లాసిక్,**
**విజ్ఞాన విహార్ స్కూల్ ఎదురుగా, ఎనికేపాడు,**
**విజయవాడ, 521108.**
**సెల్ నెం: 7013572607**

### HIRING

**Hare Krishna Gokula Kshetram, a spiritual organization dedicated to spreading Krishna consciousness, seeks experienced professionals for:**

**GRAPHIC DESIGNER**
- 3+ years of experience in digital marketing and graphic design
- Strong portfolio showcasing your creativity

**DIGITAL MARKETING EXECUTIVE**
- 5+ years of experience in digital marketing
- Proven track record of success in online marketing
- Expertise in SEO, Google Ads, Meta Ads, and websites, as well as campaigns like WhatsApp, RCS, SMS, and email.

**WHAT WE OFFER**
- Competitive salary package
- Devotional environment
- Opportunity to work with a spiritual community
- Personal growth and development If you're passionate about art, design, and spirituality, join our team!

Contact: +91 7399225533
harekrishnagokulakshetram@gmail.com
Location: Kolanukonda Village, Tadepalli, Guntur District, A.P.

### ప్రకటన

**మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి**
**నూజివీడు వారి కోర్టులో**
**S.O.P.No.3/2025**

బిట్వీన్:
1. తాళ్ళూరి ధనలక్ష్మి
2. ఈలప్రోలు కిరణ్మయి ...పిటిషనర్స్

Vs

Nill ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటిషన్ లో పిటిషనర్స్ ముష్టికుంట్ల గ్రామమునకు చెందిన పైడిపల్లి క్రిష్ణయ్య కు ముఖ్య వారసులుగా వారసత్వ సర్టిఫికెట్‌ను ఇప్పించవలసినదిగా పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ వాయిదా **ది. 06-11-2025 వ తేదిన** గలదు. కావున పై నెంబరు పిటిషన్‌లో ఏమైన అభ్యంతరములు వున్న ఎడల **ది. 06-11-2025 వ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియ చేసుకొనగలరు.

వాయిదా: **06-11-2025**

**సయ్యద్ ఫరూక్**
అడ్వకేట్
నూజివీడు
నూజివీడు
ది. 17-10-2025
సెల్: 99494 48597

### CHANGE OF NAME

**I, BHAVANA KUMARI JAIN BAFNA, W/O. AKSHIT KUMAR KUNDANMAL GANDHI (Old Name)**, residing at D.No.11-13-29/2, Sammeta Vari Street, One Town, Kothapeta, Vijayawada, NTR District, Andhra Pradesh-520001. My Name has been changed to **BHAVANA GANDHI, W/O. AKSHIT KUMAR KUNDANMAL GANDHI (New name)**. Here after my name is known as **BHAVANA GANDHI, W/O. AKSHIT KUMAR KUNDANMAL GANDHI (New name).**

**మహారాజశ్రీ గౌరవ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎట్ గన్నవరం**
**ఓ.ఎస్ నెంబరు 1/2025**

బిట్వీన్ :
మెర్తల నర్సింహా రెడ్డి. .... వాది
మరియు
పిల్లి లక్ష్మి @ శ్రీలక్ష్మి మరియు ఒక్కరు .... ప్రతివాదులు

**టు : ప్రతివాది 1**
పిల్లి లక్ష్మి @ శ్రీలక్ష్మి, భర్త: పిల్లి వెంకటేశ్వరెడ్డి, వృత్తి.వ్యాపారం ఇంటి నెంబరు:42-24-101,బ్లాక్ నెంబర్ 19బి, పాత వాటర్ ట్యాంక్ రోడ్డు అజిత్ సింగ్ నగర్, విజయవాడ యన్. టి. అర్. జిల్లా. ఆంధ్రప్రదేశ్.

ఇందుమూలముగా ప్రతివాది అయిన పిల్లి లక్ష్మి @ శ్రీలక్ష్మికి తెలియజేయునది ఏమనగా, మీపై వాది వేసిన పై దావా ది. 13-11- 2025 వ తేదీన ఉదయం 10:30 న పై కోర్టు వారు, మిమ్ములను కోర్టుకు హాజరు కావలసినదిగా ఈ ప్రకటన ద్వారా తెలియ జేయుచున్నారు. కావున మీరు గాని మీ తరపున న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల మీకు పరోక్షముగా న్యాయ నిర్ణయము జరుగును.

//కోర్టు వారి అనుమతితో //

**ఇట్లు**
**మర్కంపుడి కన్నాంబ.**
**సి. హెచ్. కోటేశ్వరరావు.**
**సి. హెచ్.దీప్తి**
**టి.శ్రీనివాస్**
**న్యాయవాదులు, ఖమ్మం**
**సెల్:947110315**

### ప్రకటన

నా క్లయింట్ రామకూరి రాజాబాబు తండ్రి : ఏసుపాదం వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి యాజమాన్య బదిలీలు ద.నెం.లు 3223/2021, యాజమాన్య ధృవీకరణల ద్వారా జరిగింది. ఇంటిపన్ను, విద్యుత్ సర్వీసు కూడా నా క్లయింటు పేరుపై కలవు.

**షెడ్యూలు ఆస్తి వివరాలు :**
**అయిటం 1 :** కృష్ణాజిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ యిలాకా వట్టిగుడిపాడు గ్రామం, ఆర్.యస్.నెం. 140/6ఇ రు దాఖలా య. 00-08 సెంట్లకు హద్దులు తూర్పు : రామకూరి రవిబాబు, దక్షిణం : పరిమి యోహాను, పడమర : రోడ్డు, ఉత్తరం : రోడ్డు,
**అయిటం-2 :** పై షెడ్యూలు పూర్తి వివరాలతో య. 0.01 1/2 దారి హక్కు హద్దులు : తూర్పు : రామకూరి రవిబాబు, దక్షిణం : అయిటమ్ నెం.1, పడమర : రోడ్డు, ఉత్తరం : తలారి పద్మ.
మొత్తం స్థలం య. 00-09 1/2 సెంట్లు

ఏ.యు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో గృహరుణం పొందుచున్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరాలు వున్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేదీ మొదలు (7) ఏడు దినములలోగా ఈ దిగువ తెలిపిన మా అడ్రస్‌కి తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తెలియజేయ గలరు. లేనియెడల ఎవరికి ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించి లోను పొందుట జరుగును. గడువు తర్వాత వచ్చు ఏ విధమైన క్లయిమ్‌లు, అభ్యంతరాలు మా క్లయింట్ లేదా రుణదాతను గానీ ఏ విధమైన స్థిరపరచ జాలవని యావన్మందికి తెలియజేయు చున్నాను.

**ఇట్లు**
**కె.సర్వేశ్వరరావు,**
**కె.అలేఖ్య,**
**న్యాయవాదులు,**
**డోర్‌నెం. 14-482, భగత్‌సింగ్ నగర్,**
**యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు.**
**విజయవాడ. ఫోన్ : 95818 73334.**

## తాడిగడపలో మంచినీటి బోరు ఏర్పాటు

**ప్రజాశక్తి-కంకిపాడు :** తాడిగడ్డ మున్సిపాలిటీ సిద్ధార్థ కాలేజీ దగ్గర ఎంతో కాలంగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు శాసనసభ్యులు బోడే ప్రసాద్ ఆదేశాలతో శనివారం కొత్త బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాడిగడప టిడిపి అధ్యక్షులు తుమ్మల రామ్ కుమార్, మాజీ వార్డ్ మెంబర్ కే కోటేశ్వరరావు, మైనార్టి అధ్యక్షులు అబ్దుల్ రజాక్, షకీలా, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కొండ్రు కోటేశ్వరరావు,ఎస్కే సాదిక్ పాల్గొన్నారు.

**డ్వాక్రా బుక్ కీపర్ల హర్షం**

డ్వాక్రా సంఘాల బుక్ కీపర్లకు అమలు చేసిన కాలపరిమితి సర్క్యులర్లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన మహిళ బుక్ కీపర్లు పెనమలూరు నియోజకవర్గ కార్యాలయంలో శాసనసభ్యులు బోడె ప్రసాద్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

## అన్నసమారాధన

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారా ధనను నిర్వహించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదాల్ని స్వీకరించారన్నారు. స్వామి వారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజ ల్ని వేద పండితులు చేపట్టారు. స్వామి వారి దర్శనానికి వేలాది మంది భక్తులు బారు లు తీరారు. స్వామివారు సర్వ పుష్పాల ంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.

## ఆధునిక పద్ధతిలో రొయ్యల సాగుతో అధిక లాభాలు : కలెక్టర్

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** రొయ్యల సాగులో సాంప్రదాయ పద్ధతులకు బదులుగా శాస్త్రీయ విధానాలను అనుసరించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, ఆ దిశగా ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు సూచించారు. శనివారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లాలోని ఆక్వా రైతులకు బయో రాస్ శాస్త్రీయ విధానంలో చేపట్టే రొయ్యల సాగు విధానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జేమ్స్ కుక్ సింగపూర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, శాస్త్రవేత్త డాక్టర్ జోస్ డోమింగోస్ బయో రాస్ శాస్త్రీయ విధానంలో చేపట్టే రొయ్యల సాగు విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కలిగించారు. ఈ విధానంలో ఇప్పటికే సాగును చేపట్టిన పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన గంటా సాయిరాం అనే రైతు తన స్వానుభవాలను

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ఇతర రైతులతో ఈ సందర్భంగా పంచుకున్నారు. బయో రాస్ శాస్త్రీయ విధానంలో గంటా సాయిరాం చేపట్టిన సాగును సందర్శించి మెళకువలు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు ఈ సందర్భంగా సూచించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలతో ఆర్థిక సహకారం అందిస్తుందని, ఆసక్తిగల రైతులు ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స శాఖాధికారి అయ్యా నాగరాజా, మత్స్య అభివద్ధి అధికారులు, ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు

**ప్రజాశక్తి-మొవ్వ :** వరల్డ్ కూచిపూడి డే సెలబ్రేషన్స్-2025 సందర్భంగా శనివారం నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు అలరించాయి. డాక్టర్ వెంపటి చినసత్యం కొరియోగ్రఫీలో వెలువడిన పలు అంశాలను ఆయన శిష్యులు ప్రదర్శించి రసజ్ఞులైన ప్రేక్షకులను ఆనంద డోలికలలో ముంచెత్తారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం సహకారంతో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 20 మంది గురువుల పర్యవేక్షణలో 150 మందికి పైగా కళాకారులు ప్రదర్శిం చిన అంశాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో భాగం గానే కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం సూత్రధారిగా కొనసాగిన భామాకలాపం నత్య రూపం కార్యక్రమాలకు తలమానికంగా నిలిచింది. సత్యభామగా అక్షరదేవెళ్ళ, శ్రీకష్ణునిగా యశశ్రీ, మాధవిగా డేగల సాంబశివరావు పాత్రోచితంగా ప్రదర్శించి రక్తి కట్టించారు. సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ వ్యవస్థాపకురాలు భావన పెదప్రోలు, నాట్య కళా పీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి : కలెక్టర్

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలలో మూడవ శనివారం ఒక ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.శనివారం ఆయన నగరంలోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యాలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** స్వచ్ఛంద్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కృష్ణా విశ్వవిద్యాలయంలో పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాలు పలు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు యూనివర్సిటీ చుట్టు పక్కల గ్రామాలైన రుద్రవరం, శారద నగర్, గుండు పాలెం, కోన, పల్లె తుమ్మలపాలెం, పోలాటితిప్ప గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాలు, డ్రగ్స్, స్వచ్ఛత లాంటి అంశాలు మీద అవగాహన కార్యక్రమాలు, బ్లీచింగ్ చెల్లించడం లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఆర్ దుర్గాప్రసాద్, కె కవిత, డా ఎ.శివశేషారెడ్డి, డా. హనుమంతరావు, విజయ శేఖర్,డా.సల్మా పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మోటూరు గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద విద్యార్థులతో గుడివాడ ఎంపిడివో బివై విష్ణుప్రసాద్ స్వచ్ఛమైన గాలి అనే అంశంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపిడివో పాఠశాల పరిసరాలను శుభ్రం చేయుట తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వార్డెన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతి ఒక్కరూ గ్రామంలో స్వచ్ఛత కోసం పాటు పడదామని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. గుడ్లవల్లేరులో శనివారం ఈ విషయమై గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాలిలో కాలుష్యాన్ని తగ్గించాలని ర్యాలీలో నినాదాలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కాలుష్య నివారణలో భాగంగా అందరూ సైకిల్ తొక్కాలని తెలిపారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు ప్రధాన సెంటర్లో ఎంపీడీవో రవికాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు కాలుష్యంపై అవగాహన కల్పించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించి గ్రామంలో ప్రతి ఒక్కరికి కాలుష్యంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణకు తమ తమ బాధ్యతలను నిర్వర్తించేదుకు కృషి చేయాలని రవికాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ విస్తరణాధికారి కె.వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయాల మహిళా పోలీసులు ఎం విజయలక్ష్మి,,ఏ దుర్గ భవాని పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. శనివారం అవనిగడ్డలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. ఉపాధి పథకం ఆధ్వర్యంలో కాలుష్య రహిత వాతావరణానికి సైకలింగ్ ఆవశ్యకత ప్రచారం చేస్తూ చేపట్టిన సైకిల్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, టిడిపి మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు నడకుదురు జనార్ధన్‌రావు, తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో ఎం. మరియాదేవి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మార్కెట్ యార్డ్‌లో స్వచ్చాంద్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడే ప్రసాద్ మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. ఎయిర్ పోర్ట్ అధారిటీ మెంబర్ ముప్పా రాజా, మార్కెట్ యార్డు ఛైర్మన్ అన్నే దనయ్య పిఏసిఎస్ ఛైర్మెన్ సుంకరశివ, ,సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి పాల్గొన్నారు.

అవనిగడ్డలో...

గుడ్లవల్లేరులో...

తోట్లవల్లూరులో...

## 137 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

**ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) :** మచిలీపట్నం నగరంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు పిడిఎస్ డిటి దుర్గంజనేయులు తెలిపారు. నగరంలోని 33 డివిజన్‌లో కందుల జయబాబుకు చెందిన నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 137 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని విఆర్ఓ సమక్షంలో కేసు నమోదు చేసినట్లు పిడిఎస్ డిటి తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి

## పామర్రు పోలీస్‌స్టేషన్ తనిఖీ

**ప్రజాశక్తి-పామర్రు :** సహాయం కోసం పోలీస్ స్టేషన్కు వచ్చిన బాధితులకి ఓదార్పు కలిగేలా తగిన సహాయం చేయాలని గుడివాడ డిఎస్‌పి వి. ధీరజ్ వినీల్ అన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం పామర్రు పోలీస్ స్టేషన్ ను డిఎస్‌పి తనిఖీ చేశారు.తొలుత స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో కొన్ని కేసుల్లో దొరికిన వాహనాలను కోర్టుకు అప్పగిం చాలని సూచించారు.పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానాన్ని పరిశీలిం చారు. మండల పరిధిలోని గ్రామాలోని శాంతిభద్రతలను సమీక్షించి బీట్ వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఫైల్స్ పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సుభాకర్ ఎస్సై వి రాజేంద్రప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-మోపిదేవి :** మండల కేంద్రమైన మోపిదేవి శివారు మోపిదేవి వార్పు వద్ద ఉన్న మోపిదేవి గురుకుల పాఠశాలలో శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. మోపిదేవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఎంఎల్ హెచ్పిఓలు కలిసి ఈ మెడికల్ క్యాంపు విద్యార్థుల కోసం నిర్వహించారు. మోపిదేవి గురుకుల పాఠశాల బాలుర పాఠశాలలో విద్యార్థి అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన సంగతి తెలిసిందే. మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న భార్గవ్ అనే విద్యార్థి అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థి మృతి చెందడంతో బీసీ బాలుర పాఠశాలలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జిల్లా మలేరియా ఆఫీసర్ రామారావు ఈ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి మృతి చెందిన సంఘటనపై పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. బీసీ బాలుర గురుకుల పాఠశాల రాష్ట్ర కార్యదర్శి పి మాధవిలత శనివారం సాయంత్రం గురుకుల పాఠశాలకు విచ్చేసి పరిశీలించారు. స్టాఫ్ మీటింగ్ పెట్టి ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీర రవి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వియంసి ఉద్యోగి ప్రభాకర్ రెడ్డికి నివాళి ముగిసిన అంత్యక్రియలు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** వియంసి వర్క్ ఇన్స్పెక్టర్, మున్సిపల్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గుంటక ప్రభాకర్ రెడ్డి అకాల మృతి పట్ల సిపిఎం, సిఐటియు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభాకర్ రెడ్డి హైదరాబాదులోని ఓ ప్రవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ శుక్రవారం మతి చెందిన సంగతి తెలిసిందే. శనివారం భవానీపురం నేతాజీ హైస్కూల్ రోడ్డులోని ప్రభాకర్ రెడ్డి నివాసం వద్ద ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు, ఐద్వా పశ్చిమ నగర గౌరవ అధ్యక్షురాలు గాదె ఆదిలక్ష్మి, ఎంబివికె రాష్ట్ర కార్యదర్శి యువి రామరాజు, వియంసి మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు జ్యోతిబసు, సిఐటియు పశ్చిమ అధ్యక్షులు జి వెంకట్రావుతో పాటు పలువురు సిపిఎం, సిఐటియు నేతలు సందర్శించి నివాళు లర్పించారు. ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వియంసి శానిటరీ విభాగం చీఫ్ ఇంజనీర్ అసిస్టెంట్ ఇంజనీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సిబ్బందితో పాటు వివిధ విభాగాలకు చెందినకార్పొరేషన్ ఉద్యోగులు, మున్సిపల్ ఎంప్లాయిస్ కోపరేటివ్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సిపిఎం, సీఐటీయూ నేతలు, ఉద్యోగుల అశ్రునయనాల మధ్య ప్రభాకరరెడ్డి అంతిమ సంస్కార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## సిపిఎం నాయకులు స్వామి మృతి

**ప్రజాశక్తి విజయవాడ సిటీ :** సిపిఎం నాయకులు వై స్వామి (57) అనారోగ్యంతో మృతి చెందారు. జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన స్వామి గత కొంత కాలంగా విజయ వాడ కొత్త ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వామి మరణ వార్త తెలుసుకున్న సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు జక్కంపూడి కాలనీలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజా పోరాటాల నేతగా కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమించే స్వామి మృతి పార్టీకి తీరని లోటు అని సత్యబాబు పేర్కొన్నారు. సిపిఎం నేతలు బి బాల దుర్గారావు, కాజా గురుమూర్తి, గురప్ప, సారమ్మ, కోరాడ రవి, సారమ్మ పరామర్శించిన వారిలో ఉన్నారు.

## రహదారికి మరమ్మతులు

**ప్రజాశక్తి-వీరులపాడు :** ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పల్లంపల్లి దాములూరు రోడ్డుకు అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. మల్లంపల్లి వద్ద వైరా కట్టలేరుకు భారీ వర్షాల కారణంగా గండి పడడంతో అధికారుల రహదారిని మూసివేశారు. ఈ రోడ్డు మార్గం ద్వారా నందిగామ, దాములూరు, సోమవారం, తదితర గ్రామాలు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పల్లంపల్లి లోలెవెల్ వంతెన వద్ద గండిపడటంతో ఆ ప్రాంత ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. తాత్కాలికకంగా రహదారికి మరమ్మతులు చేయడం వల్ల కొంతవరకు ఉపయోగ ఉంటుందని ఆయా గ్రామ ప్రజలు అంటున్నారు

# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

**ప్రజాశక్తి- నందిగామ :** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు శనివారం నందిగామలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు )జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన చర్చల్లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ విద్యుత్ సంస్థలో విలీనం చేస్తారని కార్మికులంతా ఆశతో ఎదురు చూశారని, రాష్ట్ర ప్రభుత్వం, పవర్ జేఏసీలు మోసం చేశాయన్నారు. సమ్మెకు బేషరతుగా సిఐటియు విద్యుత్ ఉద్యోగ సంఘాల స్ట్రగుల్ కమిటీ మద్దతు ఇచ్చిందన్నారు. ధర్నాలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కే.గోపాల్, యూనియన్ నాయకులు డి.శ్రీనివాసరావు, కిరణ్, కోటిరెడ్డి, సాల్మన్,సమీరా తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

**ప్రజాశక్తి - తిరువూరు :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ సాక్షి మీడియాపై వేధింపులకు పాల్పడటాన్ని తిరువూరు పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. శనివారం తిరువూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు 'సాక్షి'పై దాడులు, జర్నలిస్టులపై అక్రమ కేసులను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు ఖాజా మాట్లాడుతూ పత్రికలు, పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసు లు వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు కె.రామ్మోహన్ రావు, అసుదుల్లా, దుబ్బాకు ఆనందరావు, ఎం.వెంకటనారాయణ, షేక్ సైదులు, బి. వెంక టేశ్వరరావు, బద్రి, ఏ.మురళి తదితరులు పాల్గొ న్నారు.



## శ్రీ వేణుగోపాల స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

**ప్రజాశక్తి-గంపలగూడెం:** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి గ్రామంలో ఏం చేసి ఉన్న శ్రీ వేణుగోపాల స్వామివారిని మైలవరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం శైలజ దంపతులు శ్రీ స్వామివారిని శనివారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. గ్రామ పెద్దలు బెల్లం మధుసూదన్ రావు, ఆలయ సహాయ కమిషనర్ సంధ్య పాల్గొన్నారు.

## రవాణా భద్రతపై ర్యాలీ

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ గాంధీ సెంటర్‌లో శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాలు, తక్కువ ఇంధన వాహనాలు వినియోగం పర్యావరణ పరిరక్షణకు మేలని తెలిపారు.

## సంతకాల సేకరణ

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ఇంజనీరింగ్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 43వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి ఆధ్వర్యాన కోటిసంతకాల సేకరణ నిర్వహించారు. శనివారం భవానిపురం చర్చి సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, కంది శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్ త్రీ ఇంచార్జ్ కేసర కృష్ణారెడ్డి, ఎస్వీ రెడ్డి, పాల్గొన్నారు

## విద్యార్థులకు కంటి పరీక్షలు

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాలంపాటి ప్రసాద్ శనివారం శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 300 మంది కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. క్లబ్ సెక్రెటరీ చెరుకుమల్లి శ్రీనివాసరావు, సీతారామయ్య, సుబ్రహ్మణ్యం, సాంబశివరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

## రైతులకు చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి- నందిగామ :** కోనయపాలెం గ్రామంలో శనివారం రైతు నేస్తం, క్రాప్ లోన్స్ చెక్కులను శనివారం రైతులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కోనయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్ పాల్గొని రైతు నేస్తం కింద ఆరుగురు రైతులకు, క్రాఫ్ట్ లోన్స్ కింద నలుగురు రైతులకు మొత్తం రూ.60 లక్షల చెక్కులను అందజేశారు. ఈ నిధుల ద్వారా గ్రామీణ రైతులకు ఉపాధి అవకాశాలు పెరిగి, పశు పోషణ రంగం మరింత బలపడనుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్, మేకల సుధాకర్, కోకా వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో సోలార్ ఎగ్జిబిషన్

**ప్రజాశక్తి- నందిగామ :** నందిగామ గాంధీ సెంటర్‌లో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోలార్ ఎగ్జిబిషన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సోలార్ ఎగ్జిబిషన్లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ హితమైన విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం సమయానుకూలమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ వసంత రావు, నందిగామ మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, నందిగామ ట్రాన్స్ కో ఎడి కె.స్టాలిన్, ఆర్డిఒ బాలకృష్ణ, జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ బాబు నాయక్, .తహాశీల్దారు సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

**ప్రజాశక్తి - తిరువూరు :** విస్సన్నపేటలో శుక్రవారం జరిగిన డివిజనల్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ జూనియర్, సీనియర్ విభాగాల్లో తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. జూనియర్స్ అండర్ 14 బాలికల విభాగంలో కె.వర్షిత, జే గౌతమి, అండర్ 17 విభాగంలో ఎం.మయూరి, షేక్ షమా ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 21న గుడివాడలో జరిగే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు.

# రహదారంతా గుంతల మయం

**ప్రజాశక్తి-వత్సవాయి**

వత్సవాయి నుంచి చెవిటికల్‌కు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ముఖ్యంగా మండల కేంద్రమైన వత్సవాయిలో జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద నాలుగు కూడళ్ల సెంటర్లో రోడ్డు గుంటల మయం కావడంతో వాహనదారులు పడుతూ లేస్తూ తీవ్ర గాయాలతో వెళ్ళిపోతున్నారు. మండల కేంద్రంలోని రహదారులు ధ్వంసమైతే ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. కోటి 50 లక్షల రూపాయలతో చెవిటికల్ నుంచి వత్సవాయి వరకు తాత్కాలికంగా రోడ్లు వేశారు. తీరా మండల కేంద్రానికి వచ్చేసరికి నిధుల్లేవంటూ అధికారులు చేతులు ఎత్తేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం రోడ్లు ప్యాచ్ వర్క్‌లు చేశారే తప్ప మండల కేంద్రంలో ప్యాచ్ వర్క్‌లు చేయకపోవడం దారుణం. మండల కేంద్రానికి 25 గ్రామ పంచాయతీల నుండి వివిధ పనుల నిమిత్తం స్టేషన్కు, తాశీల్దార్ కార్యాలయానికి, మండల పరిషత్ కార్యాలయానికి, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, రైతులు, పాలకుల సైతం వస్తుంటారు. పాఠశాలల బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు అదే మార్గంలో మండల కేంద్రం నుంచి మాచినేనిపాలెం వరకు వెళ్లాల్సి ఉంది. అధికారులు మాత్రం రహదారికి ఏర్పడిన గుంతలు పూడ్చడంలేదు. దీనిపై ఆర్అండ్‌బి అధికారి పరశురామును వివరణ కోరగా పరిశీలన చేసి రెండు రోజుల్లో రోడ్డు వేస్తామని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు హనుమంతరావు మాట్లాడుతూ అధికారులు తక్షణమే స్పందించి ధ్వంసమైన రహదారులను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

## సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని కరపత్రాల పంపిణీ

**ప్రజాశక్తి-చల్లపల్లి** : విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని కృష్ణాజిల్లా సివిల్ ముఠా హమాలి జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా సుబ్రహ్మణ్యం కార్మికులకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొత్త మాజేరు సి డబ్ల్యు సి గోడౌన్ వద్ద హమాలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం లో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కట్టు బానిసలుగా చేసిందని విమర్శించారు. దేశాభివద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకపోయినా, విభజన హామీలు అమలు చేయకపోయినా రాష్ట్ర ప్రయోజనం దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించక పోవడంపై తప్పు పట్టారు. ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాటం చేస్తుం దన్నారు. కార్మికుల సమస్యల కోసం నిత్యం పోరాడుతున్న సిఐటియుకు కార్మికులు అండగా నిలబడాలని, విశాఖ పట్నంలో 4వ తేదీన జరిగే మహాసభకు కార్మికుల తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. మచిలీపట్నం పట్టణ కన్వీనర్ సిహెచ్ జయ రావు, చల్ల పల్లి మండల సిఐటియు కన్వీనర్ మహమ్మద్ పాల్గొన్నారు.

## వాలీబాల్ జట్టుకు పీటర్సన్ ఎంపిక

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో 9వ తరగతి చదువున్న విద్యార్థి వి.పీటర్సన్ గుడివాడ డివిజన్ స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి శనివారం విలేకరులకు తెలిపారు. 2025-26 సంవత్సరం వివిధ క్రీడలలో జిల్లా జట్ల ఎంపికలో భాగంగా గుడివాడ డివిజన్‌లోని 12మండలాల విద్యార్థుల నుండి గుడివాడ డివిజన్ వాలీబాల్ జట్టుకు ఎంపిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిందన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికైన జట్టులో పీటర్సన్ ఎంపికయ్యాడన్నారు. పీటర్సన్‌ను పాటు పీఈటీలు భూపాల్‌రెడ్డి, రాధలను డైరెక్టర్ శ్రీనివాసమూర్తితో ప్రిన్సిపాల్ కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.సత్యబాబు అభినందించారు.

## 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు : తహశీల్దార్

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్** : మచిలీపట్నం నార్త్, సౌత్ మండలంలో మొత్తం 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మచిలీపట్నం నార్త్ తహసల్దార్ నాగభూషణం తెలిపారు. శనివారం మచిలీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రామ్ కుమార్ అధ్యక్షతన ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో పాల్గొన్న తహసిల్దార్ మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కు సంబంధించి కష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. రైతులు కనీస మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సాధారణ రకం క్వింటాలు (కమీనే) 2369 రూపాయలు, గ్రేడ్ ఎ రకం 2389 రూపాయలకు నాణ్యతా ప్రమాణాలు కల్గిన ధాన్యం అమ్మవచ్చని తెలిపారు. ధాన్యం కళ్లాల వద్దకు వచ్చి టెక్నికల్ అసిస్టెంట్ సిబ్బంది తేమ శాతం నిర్ధారించి శాంపిల్ కలెక్షన్ చేస్తారని తెలిపారు. ఈ సదస్సులో శిక్షణ ఇచ్చుటకు కష్ణాజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఎం హెబ్సీభా, వి భారతి,పి ఎ సి ఎస్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్ లు, కస్టోడియన్ అధికారులు , డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వి ఎ ఎ లు తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి ఫౌండేషన్ చేయూత

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్** : మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక 24వ వార్డు, పాత రామన్నపేట పేట ప్రాంతానికి చెందిన జి. బాలకృష్ణ గత ఎనిమిదేళ్లుగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైయ్యాడు. వారి భార్య కుమారి మచిలీపట్నం మున్సిపల్ పార్కులో అవుట్‌సోర్సింగ్ ద్వారా చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. బాలకష్ణకి వందశాతం డిజేబులిటీ సర్టిఫికేట్ ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం నుండి పెన్షన్ మంజూరు కాలేదు. ఈ పరిస్థితిని గమనించిన మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ సభ్యులు ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ. 2,500 నగదు శనివారం ఫౌండేషన్ తరపున అందజేశ్వారు. జనసేన పార్టీ 24వ వార్డు ఇంచార్జ్ గంపాల కృష్ణ, మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కె. వేణు కుమార్, గౌరవ అధ్యక్షులు ఏ.ఆర్.కె. ప్రసాద్, ఉపాధ్యక్షులు రిలాక్స్ టీ ప్రసాద్, సభ్యులు రామకష్ణ మాస్టారు, సుధీంద్ర కుమార్ పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న దృశ్యం

## అన్నాక్యాంటిన్‌లో కలెక్టర్ అల్పాహారం

**ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్** : బందరులోని మూడు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ సందర్శించి స్వయంగా అల్పాహారం తీసుకున్నారు. క్యాంటీన్లో అల్పాహార నాణ్యతను పరిశీలించేందుకు ఆయన టోకెన్ తీసుకుని ప్రజలతో కలిసి తిన్నారు. మచిలీపట్నం మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ జెడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన కనపర్తి

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఉండవల్లిలోని సిఎం నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులను, నియోజకవర్గ సమస్యల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

బంటుమిల్లిలోని కొమ్మారెడ్డి పాఠశాలలో..

కోడూరులోని జీవీ అకాడమీలో....

అవనిగడ్డలోని ఎస్‌విఎల్‌లో...

## పలు పాఠశాలల్లో దీపావళి వేడుకలు

**ప్రజాశక్తి-బంటుమిల్లి** : బంటుమిల్లి మండలంలో కొమ్మారెడ్డి పాఠశాలలో ముందస్తుగా దీపావళి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగవల్లికలను పువ్వులు, దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఈ వేడుకలో ఎల్‌కెజి నుండి 5 వ తరగతి వరకు గల విద్యార్థులు తమ చేతులతో వివిధ ఆకర్షణీయమైన దీపపు ప్రమిదలను, వివిధ రకాల దీపావళికి సంబంధించిన గ్రీటింగ్ కార్డులను తయారు చేశారు. స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రెటరీ, కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి , స్కూల్ హెచ్‌ఎం ఎన్. శ్రీనివాసరావు పాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)** : ముస్తాబాద్ నవభారత్ హైస్కూల్‌లో శనివారం సాయంత్రం దీపావళి పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్, పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ జాకీర్ సుల్తానా, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం మొత్తం దీపాల కాంతులతో, పిల్లల సందడితో మార్మోగింది. **ప్రజాశక్తి-కోడూరు** : కోడూరులోని జీవి అకాడమీ బ్రాంచ్‌లో శనివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ దుర్గ దీపావళి పండుగ విశిష్టతను గురించి వివరించారు. అనంతరం దీపాలు వెలిగించి కాకర్స్ కాల్చి దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. జీవి అకాడమీ సంస్థల చైర్మన్ వెంపటి గోపీచంద్, బ్రాంచ్ హెడ్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు వాసు, కృష్ణ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలోని ఎస్వీఎల్ క్రాంతి కళాశాలల ప్రాంగణంలో దీపావళి పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నరక చతుర్దశి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ రాజేంద్రప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని టపాసులు పేల్చడంతో పాటు నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు.

## కూచిపూడిలో డయాలసిస్ యూనిట్ ప్రారంభం

**ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ మండలం కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో ఏడవ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా శనివారం నూతనంగా డయాలసిస్ యూనిట్ ప్రారంభించారు. ఈ వైద్యాలయం వ్యవస్థాపకులు డాక్టర్ కూచిబొట్ల ఆనంద్ చొరవతో ప్రవాస భారతీయురాలు జ్యోతి చింతలపూడి సహకారంతో 7.50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను మండల తహసిల్దార్ కే మస్తాన్, ప్రవాస భారతీయుడు హెడ్ ఆఫ్ టెక్నాలజీ సాఫ్ట్వేర్ పురాణం సీతారాం (యూఎస్‌ఏ) బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం పరిపాలన అధికారి జొన్నలగడ్డ హనుమకుమార్, ట్రైనీ ఎస్ఐ చంద్రకళ (పామర్రు) సహాయ పరిపాలన అధికారి నిమ్మగడ్డ సత్య ప్రకాష్, సలహా మండలి కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

**ప్రజాశక్తి - గుడివాడ** : చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికారి, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక పాటిమిద కళాక్షేత్ర మండపంలో అంకిత మహిళ మండలి సహకరంతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పోలీసు యాక్టు, తదితర యాక్టులపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రు లు పిల్లల ప్రతి చర్యను గుర్తించాలన్నారు. ఏదైన కేసులు నమోదు అయినప్పుడు శిక్షలు అంత్యత కఠినంగా ఉంటాయాని పిల్లలకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అంకిత ప్రసిడెంట్ జి.బేబిసరోజని, స్వాతి మహిళ సంఘం పిఓ నవీన్, అంకిత ప్రాజేక్టు మేనేజర్ టి.ఆరుణ కుమారి, సభ్యులు టి.నాగమణి, లక్ష్మీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

## 21 నుండి స్కూల్ గేమ్స్ సెలక్షన్లు

**ప్రజాశక్తి గూడూరు** : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఉమ్మడి కష్ణాజిల్లాకు సంబంధించిన స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ అండర్ 14,17 (బాలుర మరియు బాలికల) విభాగంలో ఈ నెల 21 నుండి 31 వరకు జరుగుతాయని ఎన్టీఆర్, కష్ణాజిల్లా కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న హాకీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గూడూరు, 22న వాలీబాల్, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం గుడివాడ, అదే రోజు హ్యాండ్‌బాల్, కే బి సి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పడమట, 23న స్విమ్మింగ్ డిఎస్ఏ స్విమ్మింగ్ పూల్, ఈడుపుగల్లు అదే రోజు జిమ్నాస్టిక్స్ పి.బి సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మొగల్రాజపురం, విజయవాడ 24 న బీచ్ వాలీబాల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాళ్లపాలెం 25 న సాఫ్ట్బాల్ , బేస్బాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవనిగడ్డ 27న అండర్ 14 బాలుర క్రికెట్ సెలక్షన్స్, ఎలైట్ క్రికెట్ గురుకుల అకాడమీ కనసానిపల్లె 28న ఖో ఖో ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం గుడివాడ, అదే రోజు అండర్-17 బాలుర, బాలికల క్రికెట్ సెలక్షన్స్ ఎలైట్ క్రికెట్ గురుకుల అకాడమీ కనసానిపల్లెలో జరుగుతాయన్నారు. 29న కబడ్డీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గూడూరు అదేరోజు చెస్ సెలెక్షన్స్ ఎమ్మెస్సార్ హాల్, విజయవాడ 30న అండర్ -17 అథ్లెటిక్స్, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, గుడివాడ అదే రోజు అండర్ -17 బాడ్మింటన్, కెవిఆర్ కిషోర్ ఇండోర్ స్టేడియం గన్నవరం, 31న అండర్ -14 అథ్లెటిక్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, గుడివాడ, అదే రోజు అండర్ -14 బాడ్మింటన్, కెవిఆర్ కిషోర్ ఇండోర్ స్టేడియం, యోగ సెలెక్షన్స్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పడమటలో జరుగుతాయని తెలిపారు.

# అధిక వర్షాలకు తగ్గిన పత్తి దిగుబడి

**ప్రజాశక్తి -వీరులపాడు :** ఈ ఏడాది పత్తి సాగు రైతుల ఆశలు గల్లంతయ్యాయి. అధిక వర్షాలు దిగుబడిపై ప్రభావం చూపాయి. అరకొరగా పండిన పంట అమ్ముకుందామనుకుంటే సిసిఐ కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో ప్రయివేటు వ్యాపారులు కనీస చెల్లించడంలేదు. దీంతో పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు గతం కంటే ఈ ఎడారి అధికంగా పత్తి పంటను సాగు చేశారు. గతంలో సాగుచేసిన మిర్చి పంటకు ధర లేకపోవడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు పత్తి పంటను పెద్ద ఎత్తున సాగు చేశారు . ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలు పత్తి పంటను దెబ్బతీశాయి. అధిక వర్షాలతో పత్తి పైర్లు దెబ్బతిన్నాయి. దీంతో దిగబడులు గణనీయంగా తగ్గిపోయాయి. అరకొరగానే వస్తునన పత్తికి సైతం కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో ప్రైవేట్ వ్యాపారస్తులు గిట్టుబాటు ధర కూడా ఇవ్వడంలేదు. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మిర్చి తర్వాత పత్తి పంటను అధికంగా సాగు చేశారు. మండలంలో 4 వేల ఎకరాలకు పైగానే పత్తి పంట సాగు చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో వర్షాలు సాధారణంగా ఉన్నా తరువాత నెలల్లో గతం కంటే అధిక వర్షాలు కురిసిని వర్షాలకు పత్తి పంట దెబ్బతింది. ఎకరానికి 3

నుండి నాలుగు కింటాళ్లు మించే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పత్తి దిగుబడి తగ్గిపోయి అరకొరగా వస్తున్న పత్తి దిగుబడికి సైతం మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. పత్తి ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడి పెడతారు. కౌలు రైతులు మరో రూ.20 వేలు అదరపు భారం ఉంటుంది. దిగుబడి ఎకరాకు 5 కింటాళ్లు వేసినా సగటునా రూ.6 వేలుగా లెక్కిస్తే రూ.30 వేలకు మించి ఆదాయం రాదు. ప్రభుత్వం పత్తి కింటా ధర రూ.8100లుగా నిర్ణయించింది. సిసిఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు రూ.4 వేలలోపై పత్తిని కొనుగోలుకు యత్నిస్తున్నారు. మార్కెట్ ధరకు కొనుగోలు చేస్తే కొంతవరకు మేలు జరిగిందని రైతులు అంటున్నారు.

## జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌కు జగ్గయ్యపేట విద్యార్థులు

**ప్రజాశక్తి జగ్గయ్యపేట:** జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌కు జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ విద్యార్థులు ఎంపికైన్నారు. గైడ్ టీచర్, పి.యస్ ఉపాధ్యాయులు గార్లపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు యమ్.నాగతేజ, వై.భార్గవ్ ధనుష్ తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ ప్రొటెక్టింగ్ వెహికల్స్ అండ్ బ్రిడ్జిస్ ఫ్రొం ఫ్లడ్స్ (వరద ప్రవహాల నుండి వాహనాలను మరియు వంతెనలను కాపాడే వ్యవస్థ) జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనది. నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరు కావలసి ఉందని పాఠశాల హెచ్‌ఎం పి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బందం చంద్రశేఖర్ మాస్టారుకి అభినందనలు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన రైతు బోధ మంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన కేడీసీసీ బ్యాంకుకు చెందిన సహకార సంఘం కష్ణ ఫార్మర్స్ సొసైటీ సభ్యుడిగా ఉండటంతో జనతా యాక్సిడెంట్ స్కీమ్ పరిధిలో ఆయన కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. సంబంధించిన చెక్కును మంగయ్య భార్య నాగేంద్రమ్మకు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, కష్ణ ఫార్మర్స్ సొసైటీ అధ్యక్షులు యానాల గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేయాలి : వైసిపి

**ప్రజాశక్తి-కంచికచర్ల :** కూటమి ప్రభుత్వానికి రైతుల సమస్యలు పెట్టలేదని పలువురు వైసీపీ నాయకులు విమర్శించారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో వైసిపి సీనియర్ నాయకుడు చింతా రవీంద్ర నివాసంలో వైసీపీ నేతలు మాజీ ఎంపిపి పాటిబండ్ల హరి జగన్నాధ రావు, మాజీ జెడ్పీటీసీ కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాలవ పెదబాబు విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది రైతులు పండించిన పెసలు, మినుములు, మొక్కజొన్న తదితర పంటలు కొనే నాధుడు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుదే ఆక్కారావు, సాంబశివరావు, బుడ్డి సత్యం, తంగెళ్ళమూడి రామారావు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి-మైలవరం :** స్థానిక శాసనసభ్యులు కార్యాలయంలో తెదేపా నాయకులు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మైలవరానికి చెందిన ఎం సాగర్‌కు రూ.31 వేలు, ఇస్లావత్ జగన్‌కు రూ.43 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాశక్తి-విస్సన్నపేట:** మాజీ ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఎన్ఎం ఎంఎస్ స్టడీ మెటిరియల్‌ను యుటిఎఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌వి సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో విసన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శోభారాణి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ చంటి బాబు, ఏ మురళీకష్ణ పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రాష్ట్ర స్థాయిలో జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సైన్స్ సంబరాలలో భాగంగా చెకుముకి టాలెంట్ టెస్ట్ శనివారం రెడ్డిగూడెంలో నిర్వహించారు. రెడ్డిగూడెం మండల స్థాయిలో 1013 విద్యార్థులు పాల్గొన్నారు. దీనిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 8, 9, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొనడం జరిగిందని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు మల్లిఖార్జున రెడ్డి తెలియజేశారు

## కోటి సంతకాల సేకరణ

**ప్రజాశక్తి-విస్సన్నపేట :** తిరువూరు నియోజకవర్గ పరిధిలోని విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. వైసిపి రాష్ట్ర నేత మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు తంగిరాల రామిరెడ్డి, విస్సన్నపేట మండల వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వాయు కాలుష్యంపై అవగాహన

**ప్రజాశక్తి-విస్సన్నపేట :** విసన్నపేటలోని స్థానిక ఎంపిపిఎస్ తిరుపతమ్మ టెంపుల్ పాఠశాలలో పర్యావరణానికి హాని కలిగించే టపాసులు కాల్చకుండా పర్యావరణహితంగా పండగ జరుపుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.శ్రీవల్లి తెలిపారు. వాయు, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడానికి కృషి చేద్దామని పాఠశాల విద్యార్థులు, ప్రజలకు గ్రామస్తులకు శనివారం పాఠశాల నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. మురళీకష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి - తిరువూరు :** తిరువూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర విద్యాలయం విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటలు పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ ఏ.రవి బాబు శనివారం విలేకర్లకు తెలిపారు. విజయవాడ కేబీఎన్ కాలేజీలో జరిగిన ఆటల పోటీల సెలక్షన్‌లో ఎస్‌జిఎఫ్ అండర్-19లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎల్ సిద్దు వాలీబాల్ కేటగిరిలో, డి.టై టాన్స్ నిరీక్షణ, ఎం.చ క్రవర్తి, ఏ.చరణ్ లు హ్యాండ్ బాల్ కేటగిరీలో రాష్ట్ర సాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

## మెంటల్ ఎబిలిటీ టెస్ట్ పుస్తకాలు అందజేత

**ప్రజాశక్తి - తిరువూరు :** నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) టెస్ట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన మెంటల్ ఎబిలిటీ టెస్ట్ పుస్తకాలను యుటిఎఫ్ నాయకులు తిరువూరు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం అందజేశారు. చిట్టేల, గానుగపాడు, ముష్టి కుంట్ల, వావిలాల, మునకుళ్ళ, తిరువూరు జిల్లా పరిషత్ పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న మొత్తం 132 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి యుటిఎఫ్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షులు మచ్చా శ్రీనివాస్, రాష్ట్ర ప్రచురణల కమిటీ సభ్యులు ఎన్. ముత్తయ్య, మండల ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ.వి.భరతకుమారి, ఎస్. ఉషారాణి, గౌరవాధ్యక్షులు బాజీ, సహాధ్య క్షులు ఎం రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-వత్సవాయి :** డిపిఆర్‌టియు సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సంఘం కార్యదర్శి కుమార్ రాజా, మండల ఉపాధ్యాయ సేవాదళ్ కన్వీనర్ బెల్లంకొండ పూర్ణయ్య అన్నారు. వత్సవాయి మండలంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.శ్రీను నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పి నాగరాజు, జిల్లా జనరల్ సెక్రెటరీ కె సుందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వై మల్లేశ్వరరావు, వత్సవాయి మండల అధ్యక్ష, కార్యదర్శులు జక్కా రవీంద్ర, షేక్ జాన్ పాల్గొన్నారు.

## కబడ్డీలో మైలవరం విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-మైలవరం :** గత రెండు రోజులుగా విజయవాడలో జరిగిన కష్ణ యూనివర్సిటీ మహిళా కబడ్డీ పోటీలలో స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనీమీ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారిణిలు ప్రతిభ కనపరచి యూనివర్సిటీ మహిళా కబడ్డీ ట్రోఫీని కైవసం చేసుకున్నారని ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నె స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండేళ్లుగా యూనివర్సిటీ మహిళా కబడ్డీ ఛాంపియన్ ట్రోఫీని తమ కళాశాల గేలుచుకోవడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు.

## స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాహన కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలి కోసం ప్రజా రవాణా వాహనాలను వినియోగించడం, మొక్కలు నాటడం, సోలార్ విద్యుత్‌ను వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ రావు, ఉపాధి హామీ పథకం ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌పై అవగాహన

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టలేషన్ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట ఇన్‌డోర్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సోలార్ ఎగ్జిబిషన్‌లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ సూర్యశక్తి ఆధారిత పరికరాల వినియోగం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన శక్తిని అందించడమే కాకుండా, కుటుంబాల విద్యుత్ వ్యయాలను గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు.

మాట్లాడుతున్న జెసి నవీన్

## విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరిందని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ పేర్కొన్నారు. గతం వారం రోజులుగా నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జరుగుతున్న బందర్ బొనాంజా షాపింగ్ ఫెస్టివల్‌కు శనివారం రాత్రి జాయింట్ కలెక్టర్, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు ప్రథమ బహుమతిగా టెలివిజన్, ద్వితీయ బహుమతిగా రిఫ్రిజిరేటర్, తతీయ బహుమతిగా రోల్డ్ గోల్డ్ నగల బహుమతులు అందించి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కే చంద్రశేఖర రావు, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కల్పన, జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్ సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.

## 39వ రోజుకు నిరాహారదీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : తమ భూములను ఆన్లైన్‌లో చేర్చాలని కోరుతూ ఉంగుటూరు మండలంలోని ఎలుకపాడు గ్రామ స్థులు చేస్తున్న నిరాహార దీక్ష శనివారంతో 39వ రోజు చేరుకుంది. ఈ నిరాహార దీక్షల్లో శిఖామణి, సుగుణ రావు, దావీదు, దాసు, సామేలు, పుష్పనాదం, మరియమ్మ, సుగుణ, సుబ్బమ్మ, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్‌టిపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వమండలం పెడసనగల్లు గ్రామంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జియస్టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని ర్యాలీ నిర్వహించారు. రవాణా శాఖ సిఐ, ఎస్ఐ, ఎన్డీయే కూట మి నాయకులు ,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథాలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ/నాగాయలంక : ప్రజలు స్వచ్ఛ రథాలను సద్వినియోగం చేసుకొని పొడి చెత్త ఇచ్చి దానికి బదులుగా నిత్యవసర సరుకులు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద, అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి గ్రామ పంచాయతీల కోసం ఎంపిక చేసిన స్వచ్ఛరథాలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ గహాలు, దుకాణాల్లోని పొడి చెత్తను ఆరుబయట పారవేయకుండా స్వచ్ఛ రథాలకు అందించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని బుద్ధ ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయి బాబు, ఎంపీడీవో ఎం మరియాదేవి, పైడి పాముల కృష్ణకుమారి, కైతేపల్లి అంకాలు, పంచాయతీ ఈవోలు తోట శ్రీనివాసరావు, మాధవేంద్రరావు, పవన్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాదు

## పిఎం సూర్యఘర్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గృహాలపై సౌరశక్తి ఫలకాలను ఏర్పాటు చేసుకొని సౌర విద్యుత్ వినియోగిస్తూ వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుండి సాయిబాబా గుడి వరకు ప్రధానమంత్రి-సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం వినియోగంపై నగర ప్రజలకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి సౌరశక్తి.. సుస్థిర భారత్ కు బాట, పర్యావరణ రక్షణకు.. సౌర శక్తి మన కర్తవ్యం అంటూ పలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహాలపై సౌర శక్తి ఫలకాల ఏర్పాటుతో సొంతంగా వినియోగదారులే విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చని, పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ .78 వేల వరకు ఇస్తున్న సబ్సిడీ రాయితీలను పొందడమేకాకుండా, బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. దీనికి వివిధ బ్యాంకు లు ఋణ సౌకర్యం కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

## పౌష్టికాహారం పంపిణీ

విజయవాడ : నవజీవన్ బాల భవన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో హెచ్ ఐ వి / ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారాన్ని పెజ్జోనిపేట లోని నీతోడు మానసిక వికాసకేంద్రం లో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ జిల్లా మెడికల్ ఆఫీసర్/ జిల్లా లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ బి భాను నాయక్ మాట్లాడుతూ హెచ్ ఐ వి కి విషయంలో ఎవ్వరు అధైర్య పడవలసిన అవసరం లేదని, క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. పౌష్టికాహారం ప్రతి రోజు తీసుకోవాలన్నారు. నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తంటి జోసెఫ్, నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాత ప్రభుత్వ వైద్యశాల కౌన్సిలర్ ప్రసాద్, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్, నజ్మా, దేవమణి, వాలంటీర్స్ హైమావతి, దుర్గా, రాణి పాల్గొన్నారు

## శాంసంగ్ గెలాక్సీ ఎం17, 5జీ అమ్మకాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : : ఇటీవల విడుదల చేసిన గెలాక్సీ ఎం17 5జీ స్మార్ట్‌ఫోన్‌ను వినియోగదారులు కొనుగోలు చేయవచ్చని శాంసంగ్ రీజినల్ ఇంచార్జి కె.రాజశేఖర్ తెలిపారు . నగరంలోని శాంసంగ్ స్టోర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. . ఇది అమెజాన్, శాంసంగ్ డాట్ కాంతో పాటు, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో అందుబాటులో ఉంటుంది అని తెలిపారు. గెలాక్సీ ఎం17, 5జీ, భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటైన గెలాక్సీ ఎం16 5జీ విజయాన్ని కొనసాగిస్తూ, అత్యాధునిక ఏఐ ఆవిష్కరణలను మరింత ఎక్కువ మందికి చేరువ చేసే శాంసంగ్ సంప్రదాయాన్ని ముందుకు తీసుకువెళ తోంది.అని తెలిపారు .ఇది రూ. 10,000 రూ. 15,000 ధరల విభాగంలో తొలిసారిగా "నో షేక్ కెమెరా ఫీచర్‌తో వస్తోంది అని తెలిపారు. కేవలం 7.5 మి.మీ.ల మందంతో, ప్రీమియం కెమెరా డిజైన్‌తో పాటు, ఈ విభాగంలోనే అత్యుత్తమమైన కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్‌తో అద్భుతమైన మన్నికను అందిస్తుందని తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డు లోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో గుడివాడ నియోజవర్గంలోని 15 మంది బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకష్ణతో కలిసి ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు రూ.2.90 కోట్లు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, నిమ్మగడ్డ సత్యసాయి, జగన్మోహనావు, పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షులు వాసే మురళి, నాయకులు కడియాల గణేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తన కార్యాలయం వద్ద శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 55 మంది లబ్ధిదారులకు రూ 16 లక్షల 258 లో చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 682 మందికి రూ 5,05,34,621 సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ అద్దంకి పాండురంగారావు, టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో...

అవనిగడ్డలో...

## బాలికలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం విద్యార్థినులకు ఆటల పోటీలు చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేశ్వరరావు, జిల్లా లీగల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ లు పాల్గొని బాలల హక్కుల గురించి, పోక్సో చట్టం గురించి, టోల్ ఫ్రీ నెంబర్లు తెలిపి, బాల్యవివాహాల కలిగే అనర్థాలు గురించి వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి, తదనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ సువర్ణ, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ ప్రావీణ్యం సాధించాలని అంగుళూరు డైట్ కళాశాల లెక్చరర్ వేణుగోపాల్‌రావు అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని చోరగుడి, అయినపూరు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. చోరగుడిలో ఉపాధ్యా యుల కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావా లన్నారు. అనంతరం అయినపూరు పాఠశాల విద్యార్థులకు పెన్ను లు, పుస్తకాలు, బాక్సులు అందించిన దాత దొడ్డ పూర్ణచం ద్రరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో అయినపూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ ,శ్రీనివాస్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలరావును సత్కరిస్తున్న దృశ్యం

## మూల మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

ప్రజాశక్తి-వత్సవాయి : పెనుగంచిప్రోలు చెరువు మూల మలుపు వద్ద ఎలాంటి హెచ్చరికలు బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్లే రహదారిలో చెరువు అలుగు మలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చేంత వరకు కూడా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచు ప్రమాదాలకు నిలయంగా మారింది. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు రోడ్డు బాగుందని ఉద్దేశంతో వేగంగా వెళ్తున్నారు. మూల మలుపు వద్ద కంప చెట్లు విపరీతంగా పెరగడంతో వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కూడా కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ మూల మలుపు వద్ద దిమ్మలకు రేడియం స్టిక్కర్లు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి అలుగు సమీపంలో రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## తిరుపతమ్మ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఖమ్మం నగరం ఖానాపురానికి చెందిన నల్లమోతు శ్రీను, మమత దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని దేవాలయం లోపల యాగశాలకు అవసరమైన 1400 అడుగుల గ్రానైట్ రాళ్లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, ఆలయ విశ్రాంతి ఉద్యోగి నల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ధాన్యం రైతుకు మద్దతు ధర దక్కేనా?

ఆరుగాలం కష్టపడి రైతు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధరలు దక్కడం లేదు. తేమ శాతం, తప్ప తాలు గింజ, నూక శాతం ఎక్కువగా ఉంటోందని సాకులు చెప్పి ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరలో మిల్లర్లు కోత పెడుతున్నారు. 100 కిలోలు (క్వింటా) ధాన్యానికి రైతు సగటున రూ.250 వరకు నష్టపోతున్నారు. వరి సాగు గిట్టుబాటు అవ్వడం లేదని వాపోతున్నారు. 2025-26 ఖరీఫ్ వరి పంట నూర్పిళ్లు కొద్ది రోజుల్లో మొదలవుతున్నాయి. ఈ నెల 29న కంకిపాడు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

2025-26 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 3,87,702 ఎకరాల్లో వరి పంట సాగయింది. 11 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. 8 లక్షల 02 వేల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. సేకరణకు లక్ష 50 వేలు గోనె సంచులు అవసరం అవుతాయి. గత ఏడాది గోనె సంచుల సమస్య రైతులను వేధించింది. ఆర్‌ఎస్‌కెల్లో సంచులు అందుబాటులో లేక నూర్చిన ధాన్యం కల్లంలో వారం రోజులకుపైగా నిల్వ ఉంచాల్సి వచ్చింది. రైస్ మిల్లర్ల వద్ద 50 వేలు సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో లక్ష సంచులు సమకూర్చుకోవాల్సి ఉంది. ధాన్యం కామన్ వెరైటీ క్వింటా (100 కిలోల)

7 వీక్షణం

ధాన్యానికి రూ.2,369 ఏ గ్రేడ్‌కు రూ.2,389 కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఏటా కనీస మద్దతు ధర అందుకోవడం రైతులకు గగనంగా మారుతోంది. రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కె) నిర్ధారించిన నాణ్యతా ప్రమాణాలను రైస్ మిల్లర్లు పరిగణలోకి తీసుకోలేదు. ప్రభుత్వం నిర్ణయించిన 17 శాతం తేమకన్నా అధికంగా ఉందని, తాలుతప్పు, మట్టి ఆరు శాతం కన్నా అధికంగా ఉన్నాయని సాకులు చూపుతూ కనీస మద్దతు ధరలో రైస్ మిల్లర్లు కోత పెట్టారు. క్వింటాకు రూ. 250 వరకు రైతు నష్టపోయారు.

వాతావరణ మార్పులు సమస్యగా మారాయి. నూర్పిడి మొదలైన తర్వాత మేఘావృతమవ్వడం, వర్షపు జల్లులు కురవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. నూర్చిన ధాన్యం ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో వెంటనే మిల్లులకు తరలించాల్సి వస్తోంది. పచ్చి ధాన్యం డ్రయర్ మిల్లులకు మాత్రమే తరలించాలి. 24 గంటల్లో ఈ ధాన్యం మిల్లుకు తరలించకుంటే గింజ రంగు మారిపోతుంది. కృష్ణాలో 162 రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మొత్తంలో 58 మాత్రమే డ్రయర్ మిల్లులున్నాయి. దీంతో అధిక విస్తీర్ణంలో నూర్పిడి చేసిన ధాన్యం పూర్తి స్థాయిలో డ్రయర్ మిల్లులకు తరలించడం సాధ్యపడటం లేదు, రైతులు నష్టపోతున్నారు. ఈ సీజన్‌లో సమస్యలు ఎదురవ్వకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**డిఎస్ఆర్‌వి ప్రసాద్**

## పర్యావరణ పరిరక్షణపై సదస్సు

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ** : కెఎల్‌రావు నగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి. రావు అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్

అటవీ అభివృద్ధి సలహాదారు కొమర అంకారావు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ఐదు కోట్ల మొక్కల నాటే కార్యక్రమంలో భాగంగా రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం ప్రాధాన్యత క్రమాన్ని వివరించారు. నగరీకరణ పెరిగిన నేపథ్యంలో మిద్దె తోటల ప్రాధాన్యత పెరగటం శుభపరిణామం అన్నారు. డాక్టర్ ఎన్విరావు మాట్లాడుతూ.. తమ మిద్దె తోటలో ఔషధ, కాయగూర, పూల మొక్కలను పెంచుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఇలిపిల్ల రఘుబాబు, వైస్ ప్రిన్సిపాల్ రేణుకా దేవి, మిద్దె తోటల నిపుణులు కమలాకర్, చాపరాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్‌టి సంస్కరణలతో వాహన రంగానికి ఉత్తేజం

**ప్రజాశక్తి-విజయవాడ** : జిఎస్‌టి 2.0 సంస్కరణలతో ప్రయాణికుల రవాణా వాహనాలు, వస్తువుల రవాణా వాహనాలకు 28 శాతం ఉన్న జీఎస్టీ 18 శాతానికి తగ్గిందని.. దీంతో తక్కువ

ధరలకే వాహనాలు లభిస్తున్నాయని, గతంతో పోల్చితే సొమ్ము ఆదా అవుతోందని డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన బైక్స్ స్టాల్‌ను డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లపై 12 శాతం జీఎస్‌టీ ఉండగా అది నేడు 5 శాతానికి తగ్గిందన్నారు. రవాణా వాహనాల విడిభాగాలు, ఉపకరణాలు (టైర్లు, విడిభాగాలు, ఉపకరణాలు)పై 28 శాతం ఉన్న జీఎస్‌టీ 18 శాతానికి తగ్గిందన్నారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలపై అవగాహన కల్పించేదుందుకు ర్యాలీలు, షాపింగ్ ఉత్సవాలు వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. ప్రియదర్శిని పాల్గొన్నారు.

## జిఎస్‌టిపై అవగాహన

**ప్రజాశక్తి-విజయవాడ** : సూపర్ జిఎస్‌టి .. సూపర్ సేవింగ్స్, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలపై విఎంసిలోని సర్కిల్-2 కార్యాలయం పరిధిలోని

గవర్నర్‌పేటలోని సివిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఆర్డిఓ కె.చైతన్య, బోనాల కమిషనర్ కే.ప్రభుదాస్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైతన్య, ప్రభుదాస్ మాట్లాడుతూ సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ ద్వారా సామాన్య ప్రజలకు తగిన స్లాబ్ రేట్లు ద్వారా ఎంతగానో ఆదాముతుందని అన్నారు. అంతేకాకుండా స్వర్ణాంతర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు స్వచ్ఛమైన ఆయువు గురించి వాడాల్సిన పర్యావరణహితమైన రవాణా సౌకర్యాలు, సౌర్యశక్తి విద్యుత్ వినియోగం, కాలుష్య రహిత వాడాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్, టిడిపి ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, విద్యుత్ విభాగం డిప్యూటీ ఇఇ బసవ రాజు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామ్ బాబు, సివిఆర్ స్కూల్ హెడ్ మాస్టర్ సిహెచ్.వి.సుబ్రహ్మణ్యం , తదితరులు పాల్గొన్నారు

## విద్యతో పాటు లైఫ్ స్కిల్స్ నేర్చుకోవాలి

- ఉత్సాహంగా నలందలో ఫ్రెషర్ డే

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్** : విద్యార్థులు విద్యతో పాటు లైఫ్ స్కిల్స్ నేర్చుకోవాలనే తపన ఉండాలని, అప్పుడే విజయం సాధించగలుగుతారని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్ డే వేడుకులు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణా విశ్వవిద్యాలయం రియాక్టర్ ప్రొఫెసర్ ఎం. వి.బసవేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా ఒకటే చాలదని, అన్ని రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు అనుబంధ కళాశాలల్లో ప్రత్యేక స్టడీ సెంటర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈవో దాసరి రామకృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, యువతకు సరైన నైపుణ్యం లేకపోవడం వలన ఉపాధి అవకాశాలు

పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని తెలిపారు. నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి కలిగించే విధంగా శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎలరించాయి.

## సోనీ వైర్‌లెస్ హెడ్‌ఫోన్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్** : సోనీ ఇండియా, డబ్ల్యూహెచ్-1000ఎక్స్ఎం6 వైర్‌లెస్ నాయిస్ క్యాన్సిలింగ్ హెడ్‌ఫోన్‌లను విడుదల చేసినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.ప్రతాప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 1000ఎక్స్ సిరీస్ వారసత్వంపై నిర్మించబడిన ఈ తాజా మోడల్, ప్రీమియం సౌండ్‌ను ఉత్తమ నాయిస్ క్యాన్సిలింగ్‌తో కలిపి, సంగీత ప్రియులు, ఫ్యాషన్ ప్రియులు, ప్రయాణికులు, నిపుణుల కోసం అసమానమైన ఆడియో పరిష్కారాలను సృష్టించడానికి సౌకర్యవంతమైన డిజైన్‌లో తీర్చిదిద్దబడిందన్నారు. అధునాతన ప్రాసెసర్, అడాప్టివ్ మైక్రోఫోన్ సిస్టమ్ తో శక్తివంతమైనప్పటికీ, డబ్ల్యూహెచ్-1000ఎక్స్ఎం6లో నాయిస్ క్యాన్సిలింగ్ రియల్ టైమ్‌లో మెరుగుపరచబడింది.అని తెలిపారు.

## స్వచ్ఛమైన ప్రాణ వాయువు ఆరోగ్యానికి అవసరం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ** : శుభ్రమైన ప్రాణ వాయువు ఆరోగ్యానికి, పర్యావరణానికి, భవిష్యత్తు తరాలకు అత్యంత అవసరమని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విజయవాడ మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, పాలక వర్గ సభ్యులు, సమితి అధికారులు, సిబ్బందితో 'స్వచ్ఛ ఆంధ్రా - శుభ్రమైన వాయు'పై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చలసాని అంజనేయులు మాట్లాడుతూ.. పర్యావరణ హితమైన రవాణా మార్గాలను ప్రోత్సహించడం సమాజ హితం దిశగా తీసుకున్న ఒక మంచి అడుగు అని అన్నారు. ఇందులో భాగంగా కృష్ణా మిల్క్ యూనియన్, విజయవాడ ఫ్యాక్టరీ ఆవరణ నుంచి సీతమ్మ వారి పాదాల

వరకు ఆంజనేయులు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీతమ్మ వారి పాదాల పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ శాసనసభ్యుల కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, కష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు బొట్టు రామచంద్ర రావు, నెక్కళపు వాణి శ్రీ, నెలకుదిటి నాగేశ్వర రావు, ఇంజం రామారావు, సమితి అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు మణికుమార్ ఎంపిక

**ప్రజాశక్తి-గంపలగూడెం:** ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు గంపలగూడెం మండలం పెనుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన (పదవ తరగతి విద్యార్థి) మణికుమార్ ఎంపికైనట్లు ఆ పాఠశాల పి.డి అంజయ్య తెలిపారు. ఈ నెల 17న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 సంవత్సరాల విభాగంలో ఎంపికైనట్లు వివరించారు. మణికుమార్ పల్నాడు జిల్లాలో జరగనున్న కబడ్డీ పోటీలో పాల్గొననున్నారు. పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఏ ఆంజనేయులు, హెచ్‌ఎం ఎం కష్ణఫర్, సిబ్బంది మణికుమార్‌ను అభినందించారు.

## దళిత ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ** : దేశవ్యాప్తంగా దళిత ఉద్యోగులు, అధికారులపై కొనసాగుతున్న కుల వివక్ష, వేధింపుల నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గం తీర్మానించింది. శనివారం విజయవాడలోని రాష్ట్ర కార్యాల యంలో రాష్ట్ర అధ్యక్షులు బల్లారపు జగదీష్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. హర్యానాకు చెందిన దళితుడైన అడిషనల్ డీజీపీ వై.పురాన్ కుమార్ తన మరణ వాంగ్మూలంలో కుల వివక్షతలే తన మరణానికి కారణమని వాతపూర్వకంగా తెలిపి ఆత్మహత్య చేసుకోవడం దారుణం అన్నారు. పురాన్ ఆత్మహత్యపై సమగ్రంగా విచారణ జరిపించి, అందుకు కారకులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ మిషన్ డిమాండ్ చేసింది. ఉద్యోగులపై వేధింపులు ఆగకపోతే దళిత జాతి ఉద్యమిస్తుందని అంబేద్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ హెచ్చరించింది. సమావేశంలో ఉపాధ్యక్షులు కిషోర్ బాబు, కోశాధికారి బాలాజీ, కార్యవర్గ సభ్యులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.